తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ఘనంగా ప్రపంచ ఏనుగుల దినోత్సవం



పలమనేరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:
ప్రపంచ ఏనుగుల దినోత్సవం పలమనేరు మండలం ముసలిమడుగు ఎలిఫెంట్ శాంచురీలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శాంచురీలో శిక్షణ పొందుతున్న ఏనుగులకు పూల మాలలతో అలంకరించి పూజలు చేశారు. ముఖ్యంగా కుంకీ ఏనుగుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శిక్షణ ఇస్తున్న అటవీ శాఖ సిబ్బందిని వీపులపై ఎక్కించుకొని తిరిగాయి. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి ఏనుగుల విన్యాసాలు తిలకించారు. విద్యార్థులు పండ్లు కూరగాయలు వంటి ఆహార పదార్థాలు ఏనుగులకు అందించి ఆశీర్వాదాలు అందుకున్నాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఏనుగుల దినోత్సవం జరుపుకోవడం సంతోష దాయకమన్నారు.

**ముసలిమడుగు వద్ద ఎలిఫెంట్ శాంచురీలో ఏనుగుల విన్యాసాలు**

# హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

## ఇద్దరు అరెస్టు-అవాక్కయిన జనం





శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని పానగల్‌లో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రమణయ్యపై ఓ యువకుడు దాడి చేసాడు. యూనిఫాంలో ఉన్న ఆతనిపై చేయి చేసుకున్నాడు. కత్తిచూపి బెదిరించి, జనం చూస్తుండగా హంగామా సృష్టించాడు. అక్కడ జనం తప్పు అని వారిస్తున్నా మత్తులో ఉన్న ఆతను తగ్గక, రెచ్చిపోయాడు. నడుం నుంచి కత్తితీసి, ఏం చేసుకుంటావో చేసుకో అని హెచ్చరించాడు. ఈ సంఘటనలో బుధవారం ఇద్దరు యువకులను అదుపులో తీసుకున్నట్లు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి జిల్లా ఎఎస్‌పి రవిమరోహారాచారి, శ్రీకాళహస్తి డీవైయస్‌పి నరసింహ మూర్తి, టౌన్ సిఐ వెంకటేశ్‌లు వివరించారు.

శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రమణయ్య మంగళవారం విధినిర్వహణలో పానగల్‌కు వెళ్ళారు. మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు 112కు కాల్‌రావటంతో అధికారులు హెడ్‌ను పంపారు. ఓ ప్రయాణీకుడు తన లాబ్‌ట్యాప్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయటంతో హెడ్ కానిస్టేబుల్ రమణయ్య విచారణకు బయలు దేరినట్లు మీడియాకు తెలిపారు. ఫిర్యాదుకు సంబంధించి రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంలో ఉండటంతో వాకబు చేసారు. అక్కడ ఉన్న మోటార్‌సైకిల్ తాళాలను తీసుకున్నారు. ఈ వాహనం యజమానిని పోలీసు స్టేషన్‌కు రమ్మంటూ సూచించారు.అక్కడ నుంచే మొదలైంది ఈ వివాదం. వాహనం వెనుక కూర్చున్న యువకుడు కానిస్టేబుల్‌ను దూషిస్తూ రెచ్చిపోయి మాట్లాడటం పలుమార్లు విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌పై దూకటం ఓ దశలో తన వద్ద ఉన్న కత్తిని తీసి పొడిచేస్తామంటూ హల్‌చల్‌చేసారు. ఈ సమయంలో ఏ.శ్రీనివాసులు అనే వ్యక్తి హెడ్‌కానిస్టేబుల్‌ను బెదిరిస్తూ తన వద్ద ఉన్న పిడిబాకును బయటకు తీసి ఆయనపై దాడి చేసి పొడిచేందుకు యత్నించాడు. కానిస్టేబుల్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్లు వివరించారు. పట్టణంలోని కొండమిట్టకు చెందిన అచ్చి శ్రీనివాసులు(22) గాంధీ వీధి కైకాల వీధికి చెందిన సముద్రాల జితేంద్ర కుమార్(20)లుగా అధికారులు తెలిపారు. శ్రీనివాసులుపై గతంలో కూడా ఓ కేసు ఉందని, అలాగే జితేంద్ర బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడని ఎఎస్‌పి రవిమనోహారాచారి మీడియాకు వివరించారు.

# రక్షక భటులకే రక్షణ లేకుంటే... సామాన్యుడి మాటేమిటి?

## పేట్రేగి పోతున్న గంజాయి బ్యాచ్ -పోలీసుల వైఫల్యమా...నాయకుల ఉదాసీనతా!

**శ్రీకాళహస్తి పోలీసు డివిజన్లో శాంతి భద్రతలు సజావుగా ఉన్నాయా? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన రక్షక భటులపైనే మత్తులో ఉన్న యువకులు కత్తులు దూస్తుంటే సామాన్యుడికి ఏం న్యాయం జరుగుతుంది? శ్రీకాళహస్తిలో గత కొన్ని సంవత్సరాలుగా గంజాయి విచ్చల విడిగా విక్రయాలు జరుగుతున్నట్లు విమర్శలున్నా, పట్టుబడుతున్నా కేసులతో సరిపెట్టడంతో నేడు సేవించే వారి సంఖ్య పెచ్చుపెరిగింది. గంజాయి మత్తులో ఉన్న యువకులు ఏం చేస్తున్నారో తెలియని స్థితి చోటు చేసుకుంది. మంగళవారం జరిగిన రెండు సంఘటనలను పరిశీలిస్తే శాంతి భద్రతల పరిరక్షణ పరిస్థితి ఏమిటో అర్థమౌతుంది. వెనుక వస్తున్న మోటార్ సైకిల్‌కు సైడ్ ఇవ్వని ఆర్‌టిసి బస్సును నిలిపి డ్రైవర్‌పై చేయి చేసుకోగా పానగల్‌లో సాక్షాత్తు విధినిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌పై నడివీధిలో చొక్కాపట్టుకోవటం చేయి చేసుకోవటం గమనిస్తే రక్షణ శాఖ ఎలా ఉందో అర్థమౌతుంది.**

శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం, ఇక్కడకు రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. అయితే ఇటీవల జరుగుతున్న సంఘటనలు శాంతి భద్రతలకు సవాలుగా మారాయి. మరి ఇక్కడ ఈ పరిస్థితికి కారణం పోలీసుల వైఫల్యమా? లేక వారి ఉదాసీనతా? అనేది చర్చనీయాంశంగా మారింది. సుమారు ఓ దశాబ్దం పాటు విచ్చల విడిగా మట్కా నిర్వహించిన డాన్ కథ అలా ఉంచితే, పోలీసు శాఖను విధి నిర్వహణలో స్వేచ్ఛగా పని చేయలేని సంఘటనలు ఎన్నో చోటు చేసుకున్నాయి. ఇక శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖినదీ తీరంలోని అనకట్టలు గంజాయి,మద్యం బ్యాచ్‌లకు నిలయంగా మారిందనే విమర్శలున్నా పట్టించుకోక పోవటంతో ఈ ప్రాంతం ఓ దారుణమైన హత్యకు వేదికగా మారింది. శ్రీకాళహస్తి పొలిమేరల్లోని శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలోని పొలిమేరల్లో గంజాయి విక్రయిస్తున్న వారు దొరుకుతున్నా, రక్షణశాఖ కేసులతోనే చేతులు దులుపుకున్నారు తప్ప, శాశ్వత పరిష్కారం గురించి పట్టించుకోలేదు. ఈ సంఘటనలు నేడు పోలీసులకే సవాలుగా మారింది. గతంలో ఇక్కడ పని చేసి ప్రస్తుతం సస్పెండ్ అయిన సిఐపై, ప్రాజెక్టువీధిలో యువకులు నడివీదిలో చేయి చేసుకున్నా కుమిలిపోయారు తప్ప చర్యలు తీసుకోలేదు. మరి ఈ గంజాయి బ్యాచ్‌కు 'గాడ్ ఫాదర్' ఎవరన్నది పోలీసుల విచారణలో ఎందుకు తేల్చలేక పోయారన్నది ప్రశ్నార్థకం.

### ఉదాసీనతే పోలీసులకు శాపంగా ...

పట్టణంలో గంజాయి బ్యాచ్ పేట్రేగి పోతున్నపుడు తెలిసినా పట్టించుకోకుండా ఉదాసీన వైఖరిని ప్రదర్శించారు.ఒకచోట గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పోలీసులకు విషయం తెలిసినపుడు వెంటనే మూలాలను కనుగొని కంట్రోల్‌చేసి ఉంటే నేడు అవగాహన సదస్సులునిర్వహించాల్సిన అవసరం ఉండేది కాదు. అంతేకాదు చర్యలు కఠినంగా ఉంటే నేరస్తుడు అదుపులో ఉంటాడు. అలాంటి చర్యలు తీసుకోలేదు కాబట్టి నేడు నడివీధిలో ఓ యువకుడు యూనిఫారంలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడటం గమనిస్తే 'రక్షణ శాఖ ఎంత దయనీయ స్థితిలో ఉందో' అర్థమౌతుంది.

### ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి:

శ్రీకాళహస్తిలోని యువకులు దారి తప్పి వ్యవహరిస్తున్నారు.మంగళవారం మధ్యాహ్నం రామసేతు వంతెనపై ముందు వెళుతున్న ఆర్‌టిసి బస్సు వెనుక వస్తున్న యువకులు మోటార్ సైకిల్ హారన్ ఇచ్చినా సైడ్ ఇవ్వలేదని బస్సును ఓవర్ టేక్ చేసి బస్సులకు అడ్డం పెట్టి డ్రైవింగ్ సీటులో ఉన్న డ్రైవర్‌పై చేయి చేసుకున్నారు. ఆతన్ని అదుపులో తీసుకొని పరీక్షలు జరిపితే మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. ఇలా వరుస సంఘటనలతో ప్రజలు భయభ్రాంతులౌతున్నారు.యువత వ్యవహారంతో పోలీసు వ్యవస్థ తీరు ప్రశ్నార్థకంగా మారింది.

# రెడ్‌బెర్రీ పరిశ్రమకు భూములు ఇచ్చేది లేదు

## బలవంతంగా సేకరిస్తే ఆత్మహత్యలే శరణ్యం !!
## - తహాశీల్దార్‌తో పేర్కొన్న రైతులు !!

శాంతిపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త
మండలంలోని వెంకటాపురం గ్రామంకు చెందిన రైతులు తమ ప్రాంతంలో ఏర్పాటుచేయాలనుకుంటున్న రెడ్‌బెర్రీ పరిశ్రమకు తమ భూములు ఇచ్చేది లేదంటూ రైతులు పేర్కొన్నారు. బుధవారం గ్రామ రైతులు పెద్ద ఎత్తున తహాశీల్దార్ కార్యాలయంకు చేరుకుని భూముల అంశంపై తహాశీల్దార్ తనూజతో చర్చించి వినతిపత్రం అందించారు. తమ గ్రామంలో చదువుకున్న వారు ఎవరూ లేరని ఇప్పుడిప్పుడే ఇళ్ల వద్ద ఉన్న పిల్లలు చదువుకుంటున్నారన్నారు. తామంతా వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులమని పేర్కొన్నారు. వర్షాలు లేకపోవడంతో జీవనోపాధికై బెంగళూరు వెళ్లి అక్కడ కూలీ పనిచేస్తూ పిల్లల్ని పోషిస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న సుమారు రెండు వందల కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఎకరం లేదా యాభైసెంట్లు, ఇరవై సెంట్ల భూములు మాత్రమే ఉన్నాయని అవి డికెటి భూములు కావని పట్టా భూములని పేర్కొన్నారు. దీంతో తహాశీల్దార్ తనూజ మాట్లాడుతూ ఎక్కువ నష్టపరిహారం వచే ్చలా చూస్తామని చెప్పడంతో రైతులు ఆగ్రహించారు. తమ పొలాలపై అప్పులు ఉన్నాయని దినికితోడు పరి శ్రమలకు తమ భూములు ఇచ్చి వారి వద్ద చేయికట్టుకుని జీతాలకు పనిచేయ లేమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి సైతం తీసుకెళ్తామన్నారు. తాము చదువురాని వాళ్లమని తమ భూములు లాక్కోరాదని బలవంతంగా భూములు సేకరిస్తే ఆత్మహత్యలే తమకు శరణ్యం అని పేర్కొన్నారు. అనంతరం తహాశీల్దార్ మాట్లాడుతూ విషయాన్ని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు అక్కడనుంచి ఆర్డీఓ కార్యాలయంకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సై నరేష్ పోలీసు సిబ్బందిని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేశారు.

# అభూత కల్పనల వార్తలపై కఠినంగా ఉండండి

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊరుకోవద్దు
## -క్షేత్రస్థాయిలో పోలీసులకు సిఎం నిర్ధేశం



తిరుపతి,ఆగస్టు 12ప్రభాతవార్త:
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళు గడచిపోవడంతో ఇప్పుడు ప్రభుత్వం పనితీరుపై, పార్టీల్లో నాయకులపై సామాజిక మాధ్యమాల్లో అభూత కల్పనల వార్తలు ప్రసారం చేస్తే కఠినంగా వ్యవహరించాలని సిఎం చంద్రబాబునాయుడు పోలీసులకు నిర్ధేశం చేశారు. తప్పుడు ప్రసారాలపై మరింతగా నిఘా ఉంచాలని, ఏ పార్టీకి చెందిన వారైనా ఉపేక్షించొద్దని తనదైన శైలిలో పోలీసులకు ఆదేశాలివ్వడంతో ఒకింత ఆలోచనలో పడ్డారు. ఇదే సమయంలో సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలనియంత్రణ, యువతులు, మహిళలు చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని మార్గదర్శనం చేశారు. ఎక్కడైనా చిన్నారులపట్ల, యువతుల పట్ల తప్పుగా ప్రవర్తించినా, దురుసుగా వ్యవహరించినా, మరింత నేరాలకు పాల్పడినా చూస్తూ ఊరుకోవద్దని చెప్పడంతో పోలీసులకు మరింత బలం చేకూరినట్లయిందని పోలీసువర్గాలు చెబుతున్నాయి. బుధవారం అమరావతిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్‌స్టేషన్‌లలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఎస్‌హెచ్‌ఒల వరకు దిశానిర్ధేశ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఎం పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠినంగా వ్యవహరించాలని కీలక ఆదేశాలిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ప్రధానంగా జరిగిన ఈ కీలక సమావేశంలో శాంతి భద్రతలు, మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, సైబర్ క్రైమ్,మత్తుపదార్థాలు అక్రమరవాణా, గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల కట్టడిపై పోలీసులకు పలు సూచనలు చేశారు. తిరుపతిజిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, మత్తుపదార్థాలపై పోలీసుల పనితీరును ,చేపట్టిన అత్యాధునిక సాంకేతికత వినియోగం తీరును సిఎం ప్రత్యేకంగా పేర్కొనడం విశేషం.

# ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు

## - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:
ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడానికి అధికారులు పక్కా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ తన క్యాంపు కార్యాలయం నుండి బుధవారం ఎంపిడిఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో ఎఇలు, ఎంపిడిఓలు క్లీనింగ్, నీటి పైపుల మరమ్మత్తు పనులను పరిశీలించాలని, నీటిని ఎక్కడా వృధా కాకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. అలాగే నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని, ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురవడం లేదని, లభిస్తున్న నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బంగారుపాళ్యం, పూతలపట్టు, పెద్దపంజాణి, విజయపురం తదితర మండలాల్లో 53 నివాసిన ప్రాంతాల్లో ప్రస్తుతం నీటి ఎద్దడి నెలకొందని, ఈ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని కట్టడి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో గత పదిహేను రోజులుగా గ్రామ సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాలు పని చేయడం లేదని నివేదికలు అందుతున్నాయని, ఈ విషయంను సంబంధిత ఎంపిడిఓలు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. అలాగే పెనుమూరు, ఎస్‌ఆర్‌పురం, చిత్తూరు అర్బన్, కార్వేటినగరం, గుడిపాల మండలాల్లో ఆధార్ సెంటర్లను వారం రోజుల్లోపు యధావిధిగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 13, 14, 17, 21 తేదీల్లో 22 వేల మందికి ఆధార్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అప్డేషన్‌పై ఉచితంగా నమోదు కార్యక్రమం నిర్వహించాలన్నారు. అలాగే ఈ నెల 25వ తేదీన జ్యోతిరావు పూలే భవనంలో జిల్లా స్థాయిలో సత్యవేడు సెజ్ ఆధ్వర్యంలో వివిధ కంపెనీలు యువతకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై మండల స్థాయిలో విస్తృతంగా యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు, మునిసిపల్ కమీషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 21న వరలక్ష్మీ వ్రతానికి

# వైభవంగా ఏర్పాట్లు

## టీటీడీ జేఈవో డా. ఎ. శరత్



తిరుచానూరు ఆగస్టు 12 ప్రభాతవార్త
తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 21న నిర్వహించనున్న వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిం చేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈవో డా. ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. తిరుచానూరులోని ఆస్థానమండపంలో బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదం, పారిశుద్ధం, భద్రత తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జేఈవో సూచించారు. ఆగస్టు 21న శుక్రవారం ఉద యం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్థానమండపంలో వరలక్ష్మీ వ్రతం ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ, వరలక్ష్మీ వ్రతానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రద్దీకి అనుగుణంగా తాగునీరు, మజ్జిగ, పెండాల్లు, పార్కింగ్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. భక్తులకు సమాచారం అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గం.లకు ఆన్ లైన్ లో టికెట్లను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, ఎస్ఈ శ్రీ నరసింహమూర్తి, డీఈ శ్రీ రవిశంకర్‌రెడ్డి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డా. సునీల్, ఏఈవో శ్రీ దేవరాజులు, ఏవీఎస్వో శ్రీ శ్రీహరిరావు, కేటరింగ్ అధికారి శ్రీ విజయభాస్కర్, ఆలయ అర్చకులు, పోలీసు, పంచాయతీ, వివిధ శాఖల

# ప్రాణ ప్రమాదాలతో పోరాడుతున్న ఉపాధి కూలీలు

## పర్సెంటేజీల వ్యవహారంలో అధికారుల తీరు

రైల్వే కోడూరు అర్బన్, ఆగస్టు 12 ప్రభాతవార్త
పొట్టకూటి కోసం ప్రభుత్వం కల్పించిన ఉపాధి పనులకు వెళ్లే కూలీల పరిస్థితి గోరంగా ఉంది. పని చేసుకుని కుటుంబాన్ని పోషించాలనుకుంటున్న ఉపాధి కూలీలు పనులు చేసే ప్రదేశాలలో ప్రాణాలతో పోరాడే పరిస్థితులు దాపరిస్తున్నాయి. వీటి పట్ల ఆలనా పాలన చూస్తూ ఉపాధి కూలీలను అన్ని విధాల ఆదుకుని శ్రద్ధ పెట్టాల్సిన సంబంధిత అధికారులు పర్సంటేజీల పర్వాలపై వారి తీరు ఉంది. రైల్వే కోడూరు మండలంలో మాధవరం పోడు పంచాయతీకి చెందిన ఉపాధి కూలీల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా తయారైంది. చేసిన కూలి పనులలో వచ్చిన డబ్బులు సగం సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ప్రతినెల అధికారులకు అప్పజెప్తున్నారన్న ఆరోపణలు మెండుగా ఉన్నాయి. గత మంగళవారం ఉపాధి కూలీ పనికి వెళ్లిన కంపరాజు నారాయణరాజు పనిచేస్తూ స్పృహ తప్పి పనులు చేసే ప్రదేశంలోనే పడిపోయాడు. ఆయనకు కాలు, చేయి, మాట కూడా పనిచేయకుండా పోయింది. ఆ సమయంలో ఉపాధి కూలీలకు ప్రభుత్వం అందించే ప్రథమ చికిత్స పరికరాలు మాట దేవుడు ఎరుగు కానీ కనీసం గ్లాసుడు మంచినీళ్ల ఇచ్చి వారిని ఆదుకునే పరిస్థితులు కూడా లేకుండా పోయాయి. ఈ పంచాయతీలో పనిచేసే ఉపాధి కూలీల పనులను సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ పరిశీలించిన దాఖలాలే లేవు. నెలకు ఒకటి రెండు రోజులు కూడా పనులు చేసే ఉపాధి కూలీల వద్దకు వెళ్లడని ఆరోపణలు కూడా మెండుగానే ఉన్నాయి. ఎంతమంది కూలీలు పనులకు వెళ్ళినా ఆ పంచాయతీలో ఉండే కూలీలు అందరికీ మస్టర్లు వేసి సగం సగం పంచుకోవడంలో మండలంలోనే కాదు జిల్లాలో కూడా ఇలాంటిది దిట్ట కలిగిన అవినీతి ఫీల్డ్ అసిస్టెంట్ లేరని చెప్తారు. గత మంగళవారం ఉపాధి కూలీ కంపరాజు నారాయణరాజు పనిచేస్తూ అత్యంత ప్రమాదానికి గురై కూలీల సాయంతో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయమై సంబంధిత ఏపీఓకు తెలియజేయగా ఆయన మీటింగ్ లో ఉన్నానని నిరక్ష ్య సమాధానం చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ విషయానికి వస్తే అక్కడ జరిగిన ప్రమాదం గురించి నాకు తెలియదని, తెలిసినప్పటికీ నా వద్దకు వచ్చి బ్రతిమలాడితే తప్ప నేను ఎలాంటి చర్యలు తీసుకోబోనని తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లగా తాను బాధ్యతలు చేపట్టి కేవలం నెల రోజులే అయిందని ఇంతవరకు ఎవరు ఏమిటని కూడా తెలియలేదని, ఉపాధి కూలీకి జరిగిన ప్రమాదం పట్ల తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఉపాధి కూలీ పరిస్థితి మెరుగైన వైద్యం కోసం తిరుపతి ప్రైవేటు ఆసుపత్రిలో విషమంగానే ఉంది. ప్రభుత్వం ఉపాధి పనులు చేసే కూలీలకు ఏదైనా ప్రమాదం జరిగినా,స్పృహ కోల్పోయే పరిస్థితులు వచ్చినా, పనులు చేసే ప్రాంతంలో టెంట్లు వేసి వారికి ప్రథమ చికిత్స చేసేందుకు వైద్య సదుపాయాలు, మందులు, మజ్జిగలు, తాగునీరు ఏర్పాటు చేయాలి. అయితే సంబంధిత అధికారుల అండతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలు వద్ద పర్సంటేజీలు దండుకోవడమే కాకుండా ప్రభుత్వం కూలీలకు అందజేసే వీటన్నింటినీ కూడా మింగేసి కూలీల పట్ల కనీసం కన్నెత్తి చూసిన పాపాన కూడా పోలేదు. ఈ ప్రాణాపాయ స్థితిలో ఉన్న కూలీకి ఏదైనా జరగరానిది జరిగితే ఉపాధి అధికారులే బాధ్యులని ఆయనతో పాటు పనిచేస్తున్న కూలీలు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.





**ఉపాధి పని చేస్తూ ప్రమాదానికి గురి అయిన నారాయణ రాజు**

# ఎఫ్ పీవోల ద్వారానే రైతులే గ్రేడింగ్లు, ప్యాకింగ్‌లు చేపట్టాలి: కలెక్టర్



రైల్వే కోడూరు రూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త
నియోజకవర్గంలోని బొప్పాయి రైతులు ఎఫ్ పీవోల ద్వారానే గ్రేడింగ్, ప్యాకింగ్ మరియు రవాణా కార్యక్రమాలను చేపడితే దళారులకు చోటు లేకుండా పోతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ అన్నారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని ఉప్పరపల్లి మరియు పలు ప్రాంతాలలో బొప్పాయి పంట హార్వెస్టింగ్,సీజన్ రైతులకు లభిస్తున్న ధరలు మార్కెట్ పరిస్థితులను ఆయన స్వయంగా పరిశీలించి రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలో బొప్పాయి సాగు విపరీతంగా సాగు చేస్తున్న రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెటింగ్ విధానం, ఉత్పత్తి అయ్యే తదితర అంశాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు అన్నారు. రైల్వే కోడూరు ప్రాంతంలో గత 20 సంవత్సరాలుగా అమలులో ఉన్న మార్కెటింగ్ విధానంలో ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు స్థానిక మధ్యవర్తుల ద్వారా రైతులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుని విత్తనాలు సరఫరా చేస్తున్నారని తెలిపారు. అనంతరం పంటకోత, హమాలీల ద్వారా ప్యాకింగ్, లోడింగ్ వాహనాలను ఏర్పాటు చేసి రవాణా తదితర బాధ్యతలను కూడా వారే నిర్వహిస్తున్నారని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం కిలోకు ధర 17 రూపాయల నుంచి 18 రూపాయల వరకు ధర ప్రస్తుత బొప్పాయి ధర కిలోకి సుమారు 17 రూపాయలు ఉందని గత నెల రోజులుగా మార్కెటింగ్ ధరలు సుమారు 16 నుంచి 20 రూపాయల మధ్య హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ తెలియజేశారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం వ్యాపారులు, మధ్యవర్తులతో సమావేశాలు నిర్వహించి స్పష్టమైన సూచనలు చేయడంతో ఈసారి బొప్పాయి ధరలు కొంత స్థిరంగా ఉన్నాయని ఆయన తెలియజేశారు.

# ఘనంగా శ్రీముత్తుమారెమ్మ జాతర



కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త
స్థానిక రామచంద్రారోడ్‌లో వెలసిన శ్రీ ప్రసన్న ముత్తు మారెమ్మ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా ముగిసింది. రాత్రి అమ్మవారి పుష్పపల్లకిని ఘనంగా ఊరేగించారు. అంతకుముందు ఉదయం అమ్మవారిని పికెఎం ఉడాచైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మాజీ సర్పంచ్ గోపీనాథ్, కౌన్సిలర్లు సోమశేఖర్, జిమ్‌దాము, యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్‌ఆర్ రవి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ వార్డు సభ్యుడు నాను, ఆలయ ధర్మకర్త హర్షధర్మతేజ, ప్రధాన కార్యదర్శి బిఆర్ అమర్‌నాథ్, కోశాధికారి గణేష్. శ్రీనివాసులు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా అక్టోబర్ 14-16 తేదీల్లో అమ్మవారి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ హర్షధర్మతేజ తెలిపారు.

# తిరుపతి డివిజన్



## అమరావతి చిత్రకళా వీధిలో ఆర్టిస్ట్ వెంకటస్వామి ప్రతిభ

**రామచంద్రాపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త:**

అమరావతి చిత్రకళా వీధిలో కుప్పం బాదూరు మాజీ సర్పంచ్ ఎం.వెంక టస్వామి వేసిన చిత్రం ప్రతిభను చాటింది. ఇటీవల జరిగిన అమరా వతి చిత్రకళా వీధి ప్రదర్శనలో 6 అడుగుల ఎత్తు, 4 అడుగులు వెడల్పు కలిగిన భారీ కాన్వాస్ క్లాత్‌పై శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పెయిటిం గ్‌ను ప్రదర్శించారు. ఈ కళాఖండం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఆయన ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు వెంకటస్వామిని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.

## ఆదర్శ పాఠశాల అభివృద్ధికి అండగా పాఠశాల కమిటీ

**కేవీబీపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త:**



ఆదర్శ పాఠశాల అభివృద్ధికి అండ గా పాఠశాల కమిటీ ఉంటుందని కళాశాల కమిటీ చైర్మన్ అవసరం సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కేవీబీపురం మండలం మోడల స్కూలులో కమిటీ సమావేశంలో ప్రిన్సిపాల్,చైర్మన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కమిటీ ఎల్లప్పుడూ అండగా పాఠశాల కమిటీ ఉంటుందని, అదే విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాఠశాల కావలసిన కనీస వసతులు ఏర్పాటు చేసుకోవడం జరుగుతూ ఉంది. నాయకుల అండతో ఇంకా కావలసిన వసతులు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని, విద్యార్థుల మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న గదిని, భోజనం సాంబారు నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు కాటయ్య, సుధ, నాగేశ్వరమ్మ, పరందామరెడ్డి, రాజేశ్వరి, వేలు పాల్గొన్నారు.

## ఒక మొక్క నాటండి.. వెయ్యి మందికి ప్రాణ బిక్షపెట్టండి

**రేణిగుంట, ఆగస్టు 12 ప్రభాతవార్త**



ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి దానిని జాగ్రత్తగా పెంచితే భవిష్యత్తులో ఆ మొక్క చెట్టుగా మారి 1000 మందికి ఆక్సిజన్ అందించి ప్రాణబిక్ష పెడుతుందని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు అన్నారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, ఎస్సై శ్రీనివాసులు తమ సిబ్బందితో రేణిగుంట బాలురు బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దాదాపు 1000 మొక్కలను నాటారు. వాటికి ప్రతిరోజు నీరు పోసి పెంచాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల సిబ్బందిని కోరారు. ఇప్పటికే సమాజంలో చెట్లు పూర్తిగా నశించిపోతున్నాయని డిఎస్పి ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు ఆక్సిజన్ లేకుండా చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తు తరాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్క నాటి దానిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాల భవిష్యత్తు మన తరం పైనే ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ గంటా ఇందిరా దేవి, ఎంఈవో రంగనాథ్, ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించండి

**రేణిగుంట, ఆగస్టు 12 ప్రభాతవార్త**



ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించాలని రేణిగుంట అర్బన్ ఎస్సై శ్రీనివాసులు అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. రేణిగుంట బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నందు రేణిగుంట అర్బన్ పోలీసులు అంగన్వాడి టీచర్లకు కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అంగన్వాడి టీచర్లు కార్యకర్తలకు ప్రజలతో సత్సంబంధాలు ఉంటాయని రేణిగుంట అర్బన్ ఎస్సై శ్రీనివాసులు అన్నారు. అనునిత్యం ప్రజలతో మమేకమై ప్రజల స్థితిగతులను గమనించే అంగన్వాడీలు ప్రజల్లో నేర నియంత్రణపై అవగాహన కల్పించాలని కోరారు.

## ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో అన్నమాచార్యకుకు వంద శాతం ప్రవేశాలు

**రేణిగుంట, ఆగస్టు 12 ప్రభాతవార్త**



ఏపీఈఏపీసెట్-2026 వెబ్ కౌన్సెలింగ్‌లో అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ రేణిగుంట కళాశాల అన్ని ఇంజినీరింగ్ కోర్సుల్లో వంద శాతం ప్రవేశాలు సాధించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలపై ఉంచిన నమ్మకానికి, విద్యా ప్రమాణాలకు ఈ ఫలితం నిదర్శనమని సంస్థ నిర్వాహకులు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు డా. సి. గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాధముని రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం-2020కు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన బోధన, ఆధునిక ప్రయోగశాలలు-మౌలిక సదుపాయాలు, ప్రముఖ సంస్థల ద్వారా నిరంతర ఉద్యోగ శిక్షణ, అన్నమాచార్య విలువలు-సంస్కృతిని విద్యార్థుల్లో పెంపొందించడం తమ విజయానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. కళాశాలకు 2015 నుంచి వరుసగా నాలుగుసార్లు జాతీయ గుర్తింపు, 2017 నుంచి 'ఎ' స్థాయి నాణ్యత గుర్తింపు, 2019 నుంచి పదేళ్లపాటు విశ్వవిద్యాలయ మంజూరు సంఘం స్వయంప్రతిపత్తి కళాశాల హోదా ఉన్నట్లు తెలిపారు. నూతనంగా చేరిన విద్యార్థులను అభినందించిన వారు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రేణిగుంట మండలంలో బిజెపి జెండాల ఆవిష్కరణ

**రేణిగుంట, ఆగస్టు 12, ప్రభాతవార్త:**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ సూచనల మేరకు రేణిగుంట మండలంలోని పలు ప్రాంతాల్లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల నాయకులతో కలిసి ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ జాతీయ పతాకం భారతీయుల ఐక్యత, సమిష్టి గర్వానికి ప్రతీక అని అన్నారు. ప్రతి పౌరుడు తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, జిల్లా కార్యవర్గ సభ్యులు కండ్రిగ యతీంద్ర రెడ్డి, యువమోర్చా ఉపాధ్యక్షులు ఎస్.ఆర్. వేణుగోపాల్, మాజీ కోశాధికారి శ్యామ్‌చంద్ గేహ్లోట్, పట్టణ అధ్యక్షులు భీమవరం నరేష్, మండల ఉపాధ్యక్షులు చింత రాజా రాయల్, ప్రధాన కార్యదర్శి సొంగా పురుషోత్తం, నాయకులు అశోక్, వెంకటరమణ రెడ్డి, మునివేలు, చంద్రయ్య, కర్వేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరు డ్రిల్లింగ్ పరిశీలన

**సత్యవేడు, ఆగస్టు 12 ప్రభాతవార్త:**

సత్యవేడు మండలం కొల్లడం గ్రామంలో తాగునీటి వసతిని మెరుగుపరచడానికి కొత్త బోరు డ్రిల్లింగ్‌ని అధికారులు పరిశీలించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో వెంకటేశ్వరులు, మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు కొల్లడం గ్రామానికి చేరుకుని బోరు డ్రిల్లింగ్‌ను పరిశీలించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించడానికి పీఎంఏజీవై పథకంలో కొత్త బోరు ఏర్పాటు గాను రెండు లక్షలు మంజూరైందని, ఈ నేపథ్యంలో శ్మశనానికి సమీపంలో బోరు డ్రిల్లింగ్‌ని చేపట్టారు. ఈ క్రమంలో అధికారుల బృందం సంఘటన స్థలం చేరుకుని బోరు డ్రిల్లింగ్‌ని పరిశీలించారు. జలం పుష్కలంగా పడింది. త్వరలోనే బోరుకు కొత్త విద్యుత్ మోటారుని బిగించి తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామని ఎంపీడీవో వెంకటేశ్వరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అల్లెబ్బ, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**తిరుపతి క్రైమ్, ఆగస్టు 12, ప్రభాతవార్త**

తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ఫుట్ పాత్ పై వృద్ధుడు మరణించాడు. తిరుపతి వెస్ట్ పోలీసులు సమాచారం మేరకు సుమారు 65 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వృద్ధుడు బుధవారం ఫుట్ పాత్ పై మరణించాడు స్థానికుల సమాచారంతో పోలీసుల పరిశీలించి తన వద్ద ఎటువంటి గుర్తింపు కార్డు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే తిరుపతి వెస్ట్ పోలీసులు సంప్రదించాలని తెలిపారు.

## ఎస్వీ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

**తిరుపతి విద్య, ఆగస్టు 12 ప్రభాతవార్త**



అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం హెచ్ఐవీఎయిడ్స్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రాచార్యులు (ప్రిన్సిపాల్) సి. ప్రకాష్ బాబు అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, క్షయ నివారణ అధికారిణి డాక్టర్ పి. శైలజ మాట్లాడుతూ... యువతలో వ్యాధిపై సరైన అవగాహన పెంచడం ద్వారానే దీని వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల వివక్ష చూపకుండా సామాజికంగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వ్యాధి నివారణ మార్గాలు, పరీక్షలు, చికిత్స విధానాలపై విద్యార్థులకు వివరంగా మార్గదర్శనం చేశారు.కళాశాల ప్రాచార్యులు సి. ప్రకాష్ బాబు మాట్లాడుతూ... ఈ ఏడాది యువజన దినోత్సవ ప్రధానాంశం విభిన్న సందర్భాలు – ఉమ్మడి ఆకాంక్షలు అని వివరించారు. యువత ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, లభించిన సరైన సమాచారాన్ని ఇతరులకు చేరవేస్తూ బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ కార్యక్రమ నిర్వాహకులు బి. కోటిరెడ్డి, నివారణాధికారి బి. మంజునాథ్, పర్యవేక్షకులు వై. సురేంద్రతోపాటవైద్యారోగ్యశాఖసిబ్బంది,స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తైక్వాండోలో ఎడిఫై విద్యార్థుల ప్రతిభ

### ఐదు పతకాలతో మెరిసిన ఎడిఫై విద్యార్థులు.. జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు అర్హత

**తిరుపతి విద్య, ఆగస్టు 12 ప్రభాతవార్త**



సీబీఎస్ఈ సౌత్‌జోన్1 తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2026-27లో ఎడిఫై స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం ఐదు పతకాలు సాధించారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఆరిజిన్ స్కూల్‌లో ఆగస్టు 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో ఎడిఫై స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.ఈ పోటీల్లో బాలుర జట్టు ఒక బంగారు పతకం, ఒక కాంస్య పతకం సాధించగా, బాలికల జట్టు ఒక వెండి పతకం, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. మొత్తంగా ఒక బంగారు, ఒక వెండి, మూడు కాంస్య పతకాలతో ఐదు పతకాలను ఎడిఫై స్కూల్ విద్యార్థులు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.అంతేకాకుండా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఒక బాలుడు, ఒక బాలిక సీబీఎస్ఈ జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. జాతీయ స్థాయిలో పాఠశాల తరఫున ప్రాతినిధ్యం వహించనున్న ఈ ఇద్దరు క్రీడాకారులకు పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది.సీబీఎస్ఈ జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ హర్యానా రాష్ట్రం పానిపట్‌లోని బాల్ వికాస్ ప్రోగ్రెసివ్ స్కూల్‌లో సెప్టెంబర్ 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సౌత్‌జోన్1 పోటీల్లో కనబరిచిన ప్రతిభను జాతీయ స్థాయిలోనూ కొనసాగించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు యాజమాన్యం ఆకాంక్షించింది.ఈ సందర్భంగా ఎడిఫై స్కూల్ చైర్‌పర్సన్ పి. సులోచన, డైరెక్టర్ పి. ప్రణీత్, అకాడమిక్ డీన్ పి. జాహ్నవి, ప్రిన్సిపాల్ టి. దేవరాజులు, కోచ్ లవ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది విజేతలను అభినందించారు. విద్యార్థులు సాధించిన విజయానికి వారి కృషి, పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావమే కారణమని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా పాఠశాలలో ప్రోత్సాహం, శిక్షణ అందిస్తున్నామని యాజమాన్యం తెలిపింది. సౌత్‌జోన్1 స్థాయిలో ఐదు పతకాలు సాధించడంతో పాటు ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొంది. జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సీతారాం ఏచూరి 74వ జయంతి

**పుత్తూరురూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ ఎదురుగా ఆటో స్టాండ్ సమీపంలో ఆటో స్టాండ్ సీపీఎం పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పుత్తూరు సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి వెంకటేష్, నందయ్య, విజయ్, యాసిన్ బాషా, సుబ్రహ్మణ్యం, గోవిందస్వామి, కృష్ణమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఘనంగా ఆషాడ మాసం అమావాస్య పూజలు

**నారాయణవనం, ఆగస్టు 12 ప్రభాతవార్త :**



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరి కోనలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో బుధవారం ఆషాడ అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. నెయ్యి, కొబ్బరినీరు, పశుపు, కుంకమ, చందనం, విభూది వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అంతకుముందు పవిత్ర జలపాతంలో స్నానాలను చేసా రు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణ వనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి ఆలయంలోను అమావాస్య పూజలను ఘనంగా జరిపారు. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరంభక్తులకుదర్శనభాగ్యంకల్పించారు.మధ్యాహ్నంవందలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో ఒడియార్ ఉత్సవం

**నారాయణవనం, ఆగస్టు 12 ప్రభాతవార్త :**

మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవరోజు బుధవారం సాయంత్రం ఘనంగా ఒడియార్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి,అమ్మవార్లను వెంకటకృష్ణాపాలెం, కుమ్మరివీధి, నారాయణవనంలోని రెడ్డివీధిలో ఘనంగా ఊరేగారు. ఉదయం ఆలయంలో ఉదయం స్వామి,అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి, స్థానికులు నంబాకం. సొరకాయులు, యశోదమ్మ, ధర్మరాజులు, మహిళామండలి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## చెన్నై హైవేపై ప్రారంభమైన

**నారాయణవనం, ఆగస్టు 12 ప్రభాతవార్త :**

పుత్తూరు-చెన్నై జాతీయ రహదారికి ఇరువైపుల మొలచిన మొక్కలను తొలగించే పనులను నేషనల్ హైవే అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ప్రారంభమైనది. పుత్తూరు నుంచి ఊతుకోట వరకు హైవేకు ఇరువైపుల మొలచిన చెట్లను, మొక్కలను తొలగించడం జరుగుతందన్నారు. దీంతో వాహన దారులకు ఇబ్బందులు తొలగతుందన్నారు.

## యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే లక్ష్యం : ఎస్ఐ

**కేవీబీపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త:** మాధక ద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరమని, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఎస్ఐ ఓబయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలో బుధవారం మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, రిసోర్స్ పర్సన్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం సూపర్ భాజావతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ ఓబయ్య, మండల విద్యాశాఖ అధికారి రవికుమార్, సీఆర్సీ ప్రధానోపాధ్యాయుడు కోనాటి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత ముఖ్యంగా గంజాయి, ఇతర మాధక ద్రవ్యాలకు బానిసలవుతూ మత్తు ప్రభావంతో అనేక నేరాలకు పాల్పడుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యువతను మాధక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ~~పోలీసుశాఖతో పాటు సమాజంలోని సంస్కర్తలు మహిళా సంఘాలు ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా~~

## ఊరి మధ్యలో మద్యం షాపులు వద్దు

**రేణిగుంట, ఆగస్టు 12 ప్రభాతవార్త**



ఊరు మధ్యలో ఉన్న మద్యం షాపులను వెంటనే తొలగించాలంటూ ఐద్వా మహిళా నేతలు బుధవారం దీక్షను కొనసాగించారు. మద్యం షాపుల వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం యజమానులకు వర్తించే చట్టాలు ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు వర్తించవా అంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలదే తుది నిర్ణయమని ప్రజల కోరిక మేరకు మద్యం షాపులను వెంటనే ఊరి నుండి ఊరి బయటకు బహిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా మహిళలతో పాటు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## ఏపీ టెట్-2026 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ: డిఇఓ

**తిరుపతి విద్య, ఆగస్టు 12 ప్రభాతవార్త**



ఏపీ టెట్-2026 పరీక్షల ఎనిమిదవ రోజు తిరుపతి జిల్లా అభ్యర్థులు కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతం గా పరీక్షకు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు.మొత్తం 969 మంది అభ్య ర్థులకు అవకాశం కల్పించగా, వారి లో 911 మంది పరీక్షకు హాజరయ్యా రు. 58 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 94.01 హాజరు శాతం నమోదైనట్లు డిఇఓ కేవీఎన్ కుమార్ వెల్లడించారు.పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పరీక్షలను సజావుగా నిర్వహించినట్లు తెలిపారు.

## విద్యార్థినులకు బంగారు భవిష్యత్తుకు కెరీర్ కౌన్సెలింగ్

**తిరుపతి విద్య, ఆగస్టు 12 ప్రభాతవార్త**




లక్ష్యసాధనకు స్పష్టమైన ప్రణాళిక, సరైన మార్గదర్శకత్వం ఎంతో అవసరమని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి అన్నారు. టీటీడీ యాజమాన్య సహకారంతో బుధవారం కళాశాల ఆవరణంలో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా కెరీర్ కౌన్సెలింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా తిరుపతి సీఏ ఛైర్మన్ సీఏ సింహాద్రి మోహన్, సీఏ మదన్ మోహన్ రెడ్డి, సీఏ మూర్తి రెడ్డిలు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఉన్నత విద్యా కోర్సులు, భవిష్యత్తు ఉపాధి అవకాశాలపై వక్తలు వివరంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా సీఏ, సీఎంఏ, ఈఏపీసెట్, నీట్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో ఆచరణాత్మక సూచనలు అందించారు.సదస్సులో భాగముగా విద్యార్థినులతో ప్రత్యేక ముఖాముఖి (ఇంటరాక్షన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్సుల ఎంపిక, పోటీ పరీక్షల సన్నాహాలపై విద్యార్థినులు అడిగిన పలు సందేహాలను నిపుణులు వివరంగా నివృత్తి చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ... టీటీడీ యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అందిస్తున్న ఇలాంటి మార్గదర్శక అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఎస్వీయూలో ఎక్స్‌ట్రీమోఫైల్స్‌పై అంతర్జాతీయ కోర్సు

**తిరుపతి విద్య ఆగస్టు 12 ప్రభాత వార్త**




ఎస్వీయూలో వ్యవసాయం, జీవ వైద్యం, జీవేంధన రంగాల్లో ఎక్స్‌ట్రీమోఫైల్స్ అనే అంశంపై అంతర్జాతీయ స్వల్పకాలిక అధ్యయన కోర్సు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. విశ్వవిద్యాలయ ఉపకు లపతి (విసి) ప్రొఫెసర్ టాటా నంసింహారావు ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ... అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ జీవించే ఈ విశిష్ట కంటికి కనిపించని జీవులు (ఎక్స్‌ట్రీమోఫైల్స్) వ్యవసాయం, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, ఇంధన రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దోహదపడతాయని తెలిపారు. అంతరశాఖల పరిశోధనల ద్వారా వీటి విశేష సామర్థ్యాన్ని మరింతగా వెలికితీయాలని పిలుపునిచ్చారు.సదస్సులో జాతీయ సముద్ర విజ్ఞాన సంస్థ (ఎన్ఐఓ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బెల్లె దామోదర్ శెనోయ్ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా ఈ పరిశోధనలను వేగవంతం చేయవచ్చని వివరించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రామ్ కరణ్ మాట్లాడుతూ, ఈ అతిచిన్న జీవులు భవిష్యత్తు సుస్థిర సాంకేతికతకు, అంతరిక్ష పరిశోధనలకు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. అలాగే జార్జియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కలిసా బుగాటి ఆధునిక పరిశోధనాంశాలపై మార్గదర్శనం చేశారు.దేశ విదేశాల శాస్త్రవేత్తల భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ కోర్సు విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవి ద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

### స్కూటరిస్ట్‌కు తీవ్రగాయాలు

**చంద్రగిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని కొత్తఇండ్లు సమీ పంలో ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. వివరాల్లోకెళితే.. పూతలపట్టు - నాయుడుపేట జాతీ య రహదారి కొత్తఇండ్లు వద్ద బుధ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాకాల మండలం, గుంత గాదంకి గ్రామానికి చెందిన జడబాబు (48) తీవ్రగాయాలపాలయ్యాడు. తిరుపతి నుండి సొంతూరుకు వెళుతున్న జడబాబును తిరుపతి నుండి తమిళనాడు వెళుతున్న కారు డ్రైవర్ అధిక వేగంతో వెనుక నుండి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జడబాబు తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది.దీంతో సమాచారం అందుకున్న 108 సిబ్బంది జడబాబును తిరుపతి రుయాకు తరలించారు. తాపీ మేస్త్రిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ప్రమాదంపై ఆయన కుమార్తె జడ వనజ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం "షైన్" లక్ష్యం

### డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి



**చంద్రగిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:**

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందిం చడమే (సైన్స్ అండ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫర్ ది నెక్స్ట్‌జన్ ఎక్స్‌ప్లోరర్స్) షైన్ ముఖ్య ఉద్దేశ్యమని డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి అన్నా రు. స్థానిక మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్‌లో బుధవారం భారత వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యార్థులకు రెండు రోజుల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, పరిశోధన పట్ల ఆసక్తి, ఆరోగ్యం, పరిశోధనపై అవగాహన కల్పించడం, వాస్తవ ప్రపంచంలోని ప్రజారోగ్య సమస్యలను అర్థం చేసుకునే విధంగా చేయడమే షైన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. భారతదేశ వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా యువతలో శాస్త్రీయ ఆలోచనలు, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడంలో షైన్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదర్, ఎస్‌విఎంసి ప్రొఫెసర్ డాక్టర్ చరిత, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నారాయణవనం మండల మీట్ : ఎంపిడిఓ

**నారాయణవనం, ఆగస్టు 12 ప్రభాతవార్త :**

నారాయణవనం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13వతేది గురువారం ఉదయం 10.30గంటలకు ఎంపిపి పి దివాకర్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ అరుణ తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపిటిసిసభ్యులు, అధికారులందరు పాల్గొనవలసిందిగా కోరారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can

ఎం.ఆర్.పల్లి శాఖ(5611) తిరుపతి ఫోన్: 832997702

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపిననూ ఐట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 05.10.2026వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో తేది:06.10.2026 సా.4.00గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180148650818 | ఆర్.రంగారెడ్డి, తండ్రి ఆర్.వెంకటరమణా రెడ్డి, 7-170, శాంతినగర్, ఎం.ఆర్.పల్లి, తిరుపతి – 517502 | 18.40 | |
| 2 | 125004729879 | ఆర్.రంగారెడ్డి, తండ్రి ఆర్.వెంకటరమణా రెడ్డి, 7-170, శాంతినగర్, ఎం.ఆర్.పల్లి, తిరుపతి – 517502 | | 5,91,510.00 |

తిరుపతి, తేది: 12.08.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

# శ్రీకాళహస్తి డివిజన్

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో... దేవాదాయశాఖ కమిషనర్ తనిఖీలు





సన్నిధివీధిలో కార్‌పార్కింగ్‌లను పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సమస్యలకు సంబంధించి వ్యక్తిగతంగా పరిశీలించారు. కొంత కాలం క్రితం శ్రీకాళహస్తీశ్వరాలయం రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్‌లో మొదటి స్థానంలో ఉండేది. అయితే ఇటీవల నిర్వహించిన సర్వేలో స్థాయి దిగజారిపోయింది.ఇందుకు కారణాలేమిటో ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆలయంలో భక్తుల తోమమేకమైన ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆది నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభివృద్ధికి కమిషనర్ పలు సూచనలు చేస్తున్నారు.దేవస్థానంలో కొనసాగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల విస్తరణ, దర్శన సదుపాయాలు మరియు రద్దీనిర్వహణను సమీక్షించారు. శానిటేషన్ సిబ్బంది సంఖ్యను పెంచాలని, భక్తులకు అందిస్తున్న తాగునీటి సదుపాయంలో ప్లాస్టిక్ క్యాన్లకు బదులుగా, స్టెయిన్‌లెస్ స్టీల్ క్యాన్లను వినియోగించాలని సూచించారు. ఆలయంలో ఆలయ సంప్రదాయ, ఆధ్యాత్మిక శైలికి అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యాన్న దానంలో భక్తులకు రుచికరమైన అన్నప్రసాదం వడ్డించాలని సూచించారు. గంగాసదన్‌లో వసతి గదుల సదుపాయాలను పరిశీలించారు. క్యూలైన్లు, రాహుకేతు పూజా మండపంలోని భక్తులతో స్వయంగా సమీక్షించి, సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. కార్యక్రమాల్లో దేవస్థాన ఇఓ బికె వెంకటేశులు, ఛైర్మన్ కె. సాయి ప్రసాద్, బోర్డు సభ్యులు గురప్ప శెట్టి, లక్ష్మమ్మ, ఇఇ శ్రీనివాసరాజు, ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 ప్రభాతవార్త: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 202627 విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఎస్ వి ఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ తెలిపారు. శ్రీకాళహస్తి ఎస్ పి ఏ కళాశాలలో ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ఉందని చెప్పారు. ఇందులో బి.ఏ, బి.కాం, బి.ఎస్సీ, బి.ఎల్ఐ.ఎస్సి కోర్సులు ఉన్నాయి.ఇంటర్, అపోస్,నియస్,పాలిటెక్నిక్, ఐటి ఐ ఉత్తీర్ణులు అర్హులు. అడ్మిషన్ కోసం ఎస్వీ ఎ కళాశాలలోని లెర్నర్ సపోర్ట్ సెంటర్ ను సంప్రదించాలని కోఆర్డినేటర్ డాక్టర్ సి. బాపనయ్య తెలిపారు.

## ఫిన్లాండ్ విద్యా అధ్యయన పర్యటనకు బాలు



తొట్టంబేడు ఆగస్టు 12 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రమణ్యం 15న బయలుదేరి ఫిన్లాండ్ లో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందుకున్నారు. ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, అభ్యాస నైపుణ్యాలను బలోపేతం చేయడానికి ఆగస్టు 17 నుండి 26వ తేదీ వరకు ఫిన్లాండ్ లోని తుర్కు యూనివర్సిటీ లో జరిగే ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణా కార్యక్రమంలో బాలు పాల్గొంటారు. మొత్తం 29 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరవు తున్నారు. 2025 సెప్టెంబర్ 5వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల బాలసుబ్రమణ్యం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సంగతి విధితమే. తిరుపతి జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన బాలుని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.యన్.కుమార్, తొట్టంబేడు మండల విద్యాశాఖ అధికారులు భారతి,ముని తిరుమలయ్య, మండల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## పార్టీ పటిష్టతే లక్ష్యంగా...కందాడలో నేతల సమావేశం



ఏర్పేడు, ఆగస్టు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఏర్పేడు మండల స్థాయి సమావేశం మంగళవారం కందాడ పంచాయతీలోని శివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు అధ్యక్షత వహించారు. యూనిట్, క్లస్టర్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో పార్టీని మరింత పటిష్టపరచడం, రాబోయే సర్ ప్రక్రియ,డోర్ టు డోర్ కార్యక్రమంనిర్వహణ తీరుపై చర్చించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న హౌసింగ్ పథకం, వితంతు పెన్షన్, రైతుల వ్యవసాయ భూముల ఫ్రీ హోల్డ్ అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించేందుకు కార్యాచరణను రూపొందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చూడాలని, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాయకులు తీర్మానించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, శివశంకర్ రెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, క్లస్టర్ క్రిష్ణప్ప మొదలియార్, యూనిట్ ఇంచార్జెస్ బాబు నాయుడు, కేశినేని సుబ్రమణ్యం, రవి నాయుడు, సీతాపతి ఆచారి, గుడి మల్లం ఆలయ ఛైర్మన్ బత్తల గిరి నాయుడు, మోహన్ నాయుడు, సూరి నాయుడు తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరస్వతి కండ్రిగలో నూతన రేషన్ షాపు ప్రారంభం



ఏర్పేడు, ఆగస్టు 12 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం సరస్వతి కండ్రిగ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును బుధవారం ప్రారంభించారు. డీలర్ సీమల జ్యోతి పేరుతో ప్రారంభమైన ఈ రేషన్ షాపును మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పేరం నాగరాజ నాయుడు మాట్లాడుతూ, కొత్త రేషన్ షాపు ఏర్పాటుతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా పేదలు, వృద్ధులు సుదూరం వెళ్లకుండా తమ గ్రామంలోనే నిత్యావసరాలు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తామన్నారు. దీనివల్ల పేదలకు మేలు జరుగుతుందన్నారు. నూతన రేషన్ షాపు ప్రారంభంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. డీలర్ సీమల జ్యోతి అందరికీ న్యాయంగా, పారదర్శకంగా సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, శివశంకర్ రెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, మోహన్ నాయుడు, గిరి నాయుడు, బాబునాయుడు, యూనిట్ కేశినేని సుబ్రమణ్యం, బాల సుబ్రమణ్యం, చిన్న బత్తిరెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాక్లెట్ కంపెనీ నిర్లక్ష్యంతో నిరుపేద కార్మికుడు మృతి



వరదయ్యపాలెం, ఆగస్టు 12 ప్రభాతవార్త: వరదయ్యపాలెం మండలంలోని కంచరపాలెం సమీపంలో వున్న డిపి చాక్లెట్ కంపెనీ నిర్లక్ష్యంతో కార్మికడు బుచ్చినాయుడు కండ్రిగ మండల వెస్ట్ వత్తూర్‌కు చెందిన కనపర్తి సునీల్ (33) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలీలా వున్నాయి. డిపి చాక్లెట్ కంపెనీ పనిచేస్తునన్న కార్మికడు కనపర్తి సునీల్(33)తీవ్రంగా గాయపడ్డాడని ఆ యువకుడిని చికిత్స నిమిత్తం తడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారన్నారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు ప్రమాదంలో తమ కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తమ కుటుంబ సభ్యుడు మృతి చెందాడని 50 లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదయ్యపాలెం మండలంలోని డిపి చాక్లెట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో భద్రతా లోపాలు ఒక కార్మికుడి ప్రాణాన్ని బలితీసుకున్నాయి. కంపెనీ యాజమాన్యం, సేఫ్టీ అధికారుల ఘోర నిర్లక్ష్యం కారణంగా బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి చెందిన కనపర్తి సునీల్ (33) అనే యువకుడు మృతి చెందాడు.ఈ ఘటన కంపెనీ ప్రాంగణంలో కనీస రక్షణ చర్యలు పాటించకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం అని, ప్రమాదం జరిగిన స్థలంలో తీవ్రమైన రక్తపు మడుగులు, భద్రతా వైఫల్యాలను స్పష్టం చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. మృతిచెందిన యువకుడిని సునీల్‌గా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. సునీల్ బుచ్చినాయుడుకండ్రిగ మండలం వెస్ట్ వరత్తూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా సమాచారం.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదం ఎలా జరిగింది? ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఏమిటి? అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## పెళ్లి ఆశలు చూపి నగలు, నగదు దోచుకుని పరార్

### - 8 సవరాల బంగారం, 10వేల నగదు అపహరణ

తిరుపతి క్రైమ్, ఆగస్టు 12 ప్రభాతవార్త: వితంతువు గానే ఎన్ని రోజులు ఉంటావు పెళ్లి చేసుకుని కొత్త జీవితం ప్రారంభించొచ్చుగా అని ఇద్దరు మోసగాళ్లు ఎనిమిది సవరాల బంగారు పదివేల నగదు దోచుకుని నిందితులు పరార్ అయిన ఘటన తిరుపతిలోని అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్సై శ్రీ వాణి సమాచారం మేరకు కడప జిల్లా, ప్రొద్దుటూరు పట్టణంలోని బాలాజీ నగర్ కు చెందిన మహిళ తన భర్త సమీపకాలంలో ప్రమాదవశాత్తు మరణించడంతో తన ఇద్దరి బిడ్డలతో బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవన సాగిస్తుంది. సాఫీగా సాగుతున్న ఆమె జీవితంలో దూరపు చుట్టమునైన భద్రమ్మ పరిచయం చేసుకుని సన్నిహితంగా మెలగసాగింది. ఈ క్రమంలో భద్రమ్మ బాధిత మహిళతో మాట్లాడుతూ ఇంకా ఎన్నినాలు ఒంటరిగా ఉంటావు అంటూ పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించొచ్చు కదా అని ఆమెకు పెళ్లి ఆశలను చూపింది. నాకు తెలిసిన వ్యక్తి తిరుపతిలో ఉన్నారు. వారిని పరిచయం చేస్తానని అందంగా ముస్తాబై నగలు వేసుకుని రమ్మన్నది. ఆమె మాయమాటలు గ్రహించక బాధితురాలు భద్రమ్మతో కలిసి పది సవరాల బంగారు, పదివేల రూపాయలు నగదు బ్యాగులో వేసుకుని తన ఎనిమిదేళ్ల కూతురితో తిరుపతికి చేరుకుంది. కపిల తీర్థం సమీపాన ప్రైవేట్ లాడ్జిలో గదిని తీసుకుని ప్రసాద్ రెడ్డి ఇక్కడికి వస్తాడని సమీపంలో మా బంధువులు ఇంటికి వెళ్లి వస్తానని నమ్మించి భద్రమ్మ అక్కడ నుండి పరారయింది. అక్కడ చేరుకున్న ప్రసాద్ రెడ్డి మరుసటి రోజు తిరుమలకి వెళ్దామని నమ్మించి ఆటోలో తిరుపతి బస్టాండుకు చేరుకున్నాక కారు తీసుకుని వస్తానని చెప్పి ముందుగానే ఆమె బ్యాగులో దొంగలించిన పది సవరాల బంగారు, పదివేల రూపాయల నగదుతో అక్కడ నుండి పారిపోయాడు. ఎంతసేపటికి ప్రసాద్‌రెడ్డి రాకపోవడంతో మోసపోయాను అని గ్రహించిన బాధితురాలు తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్ఐ శ్రీవాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎన్ఎంఎంఎస్‌కు ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

యర్రావారిపాలెం, ఆగస్టు 12 ప్రభాతవార్త: జాతీయ ఉపకార వేతన పరీక్ష ఫలితాల్లో తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. సరళ తెలిపారు. షేక్ మిస్బా, ఎం. షణ్ముఖ్ నాథ్, ఎం. రితిక, ఎం. ఉదయ్ కుమార్, ఎల్. నీరజ్, పుష్పలత ఎంపికయ్యారు. మండలంలో అత్యధిక మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచే ఎంపిక కావడం గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## పోలీసు హెడ్‌పై...దాడికి పాల్పడిన నిందితుని ఊరేగింపు



శ్రీకాళహస్తి, ఆగస్టు 12 ప్రభాతవార్త: పట్టణంలోని పానగల్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఓ సంఘటనలో హెడ్‌కానిస్టేబుల్ రమణయ్యపై దాడి చేసిన నిందితుడు శ్రీనివాసులు చేతులు,కాళ్ళకు సంకెళ్ళు తగిలించి పట్టణంలో ఊరేగింపు జరిపారు.పోలీసులపై తిరగబడి జనం చూస్తుండగా హల్ చల్ చేసిన శ్రీనివాసులును అదుపులో తీసుకొని రిమాండ్‌కు పంపే క్రమంలో కాళ్ళు చేతులకు సంకెళ్ళు తగిలించి నడిపించుకుంటూ జనం చూసే విధంగా కోర్టుకు తీసుకెళ్ళారు. ఈ ఊరేగింపులో పెండ్లి మండపం సర్కిల్‌లో జనం ఆతన్ని చూసే విధంగా నిలబెట్టారు.
మేరకు సిఐ వెంకటేశ్ సారధ్యంలో ఊరేగింపు జరిపారు.

## భరద్వాజతీర్థంలో చనిపోతున్న బాతులు



శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న భరద్వాజ తీర్థంలో కన్నుల పండువగా ఆహ్లాదాన్ని అందించే బాతులు ఏ కారణాల చేతనో చనిపోతున్నాయి.ఈ కోనేరులో టన్నుల కొద్ది చేపలున్నాయి.అలాగే చూపరులను ఆకట్టుకునే రీతిలో పది బాతులు ఈదుకుంటూ అక్కడకు వచ్చిన వారు అందించే ఆహారాన్ని తీసుకుంటూ న్నాయి. గతంలో ఇక్కడ చేపలు మృతి చెందాయి. ప్రస్తుతం అధిక వేడి వల్లనో లేక నీటి కాలుష్యంతోనో రెండు బాతులు చనిపోయాయి. ఇక్కడ ప్రతి రోజూ వేకువ జామున వందలాది మంది పట్టణానికి చెందిన వారు వాకింగ్ చేస్తుంటారు. ఈ దృశ్యం చూసి చలించిపోయారు. దేవస్థానం వెంటనే స్పందించి పరిస్థితి సమీక్షించి రక్షణ కల్పించాలని కోరారు.ఇక ఇక్కడ నీరు నూనె జిడ్డుతేలి కొలను దుర్వాసన వస్తుందని వివరించారు.నీటిని ల్యాబ్‌కు పంపి పరీక్షించి అవసరమైతే నీటిని తలలించాలని కోరుతున్నారు.

## కన్నుల పండువగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో బుధవారం రాత్రి అమావాస్య ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్లు నాలుగుమాడా వీధుల్లోని ప్రజలతో పాటు భక్తులకు దర్శనమివ్వటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో బుధవారం స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ఆలంకరించి బోయిలు మోసుకకుంటూ గ్రామోత్సవంను నిర్వహించారు.ఈ ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం వారి సహాచరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మున్సిపల్ ఉన్నత పాఠశాల టాప్

శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ సత్తా చాటిన శ్రీకాళహస్తి మున్సిపల్ బాబూ అగ్రహారం పాఠశాల విద్యార్థులు మరో అడుగుముందుకేసి ఎన్ఎంఎంఎస్ 2025-26 పరీక్షల్లో మరో విజయం సాధించి రికార్డు సృష్టించారు.శ్రీకాళహస్తి మున్సిపల్ బాబూ అగ్రహారం ఉన్నత పాఠశాల విద్యాభోధనలో ముందంజలో ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన పరీక్షల్లో 9 మంది విద్యార్థులు ఎంపిక కావటం విశేషం. తిరుపతి జిల్లాలో ఒకే పాఠశాల నుంచి 9మంది ఎంపిక కావటం ఒకటే అంతేకాక తిరుపతి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి కూడా ఇదే పాఠశాలకు చెందిన వాడు కావటం విశేషం. ఈ పాఠశాల నుంచి హాజరైన ఏ.పోతన్ సాయి 142 మార్కులు సాధించారు. కాగా జే మానస (115),వి.లోకేష్(113),టి.శివాన్ (112), ఏ.మునిహర్షవర్థన్ (103),గౌతమి(102), డి.తేజస్విని(93), జి.దీపక్ సాయి(91), ఎస్‌కె మొహమ్మద్ ఖురషిద్ (83) మార్కులు సాధించారు.ఈ విద్యార్థులను బుధవారం విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంబటి శ్రీదేవి వారి సహాచర ఉపాధ్యాయులు సత్కరించారు. భవిష్యత్తులో ఇంకా మ ంచి స్థానాలు సాధించి చదువుకుంటున్న పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.

## శాస్త్రీయ పరిశోధనల వైపు ప్రోత్సహించండి

### -పుత్తూరు డివైఇవో మహేశ్వరరావు



శ్రీకాళహస్తి, ఆగస్టు12 ప్రభాతవార్త : విద్యార్థులను శాస్త్రీయ పరిశోధనల వైపు ప్రోత్సహించడానికి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని, దేశ వైజ్ఞానిక అభివృద్ధి సృజనాత్మక బాలల ఆలోచనల నుండి మొదలవుతుందని పుత్తూరు డివైఈవో మహేశ్వర రావు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహించిన ఎన్‌సిఎస్‌సి ఒక్కరోజు శిక్షణా తరగతులను బుధవారం అయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య గారు, అపకాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కె.డిసారధి అకడమిక్ సైన్స్ కో ఆర్డినేటర్ ఎస్. కోదండపాణి, రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఎన్ సుబ్రమణ్యశర్మ , బాలసుబ్రమణ్యం, పుత్తూరు డివిజన్లోని సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అన్ని పాఠశాలలు ఈనెల 15వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, ప్రాజెక్ట్ అభివృద్ధికి రెండు నెలల సమయం ఉంటుందని, మన చుట్టూ ఉండే అనేక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రాజెక్టులను రూపొందించి జిల్లాను జాతీయస్థాయిలో అగ్ర స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.

## ఫోటో గ్రాఫర్ల దినోత్సవం




శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఫోటోగ్రాఫర్లు బుధవారం రాబోవు ఫోటోగ్రాఫి దినోత్సవానికి సంబంధించి ముందస్తు సంబరాలు జరుపుకున్నారు.పట్టణంలోని పెండ్లి మండపం వద్ద రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి సారధ్యంలోస్థానిక అధ్యక్షులు ఒబ్బు మధుసూధన్ సారథ్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మధుసూధన్‌ను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఫోటో,వీడియో గ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతికత ఏ1 టెక్నాలజీ వినియోగం పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఫోటోగ్రాఫర్లు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని మరింత అభివృద్ధి సాధించాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమాల్లో సంఘాధ్యక్షుడు ఒబ్బు మధుసూధన్,ప్రదాన కార్యదర్శి ముత్యాల వేణుగోపాల్,,కోశాధికారి బాబు,దాము నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జీతాల కోసం కార్మికుల ఆందోళన



శ్రీకాళహస్తి, ఆగస్టు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న డైలీ వేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత 3 నెలలుగా జీతాలు చెల్లించలేదని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కత్తి రవి తెలిపారు. మే, జూన్, జూలై నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధం, డ్రైనేజీ వంటి సేవలు ఈ కార్మికులతోనే నడుస్తున్నాయని చెప్పారు. కార్మికులను ఏపీ కెఎస్ పరిధిలోకి చేర్చి ఈ ఎస్ ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జాన్, కోకిల, హరి, కొండమ్మ, శారదమ్మ, నేతాజీ పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌లో ముగ్గురు బంగారు తల్లులు



తొట్టంబేడు, ఆగస్టు 12 ప్రభాత వార్త: తొట్టంబేడు మండలం కాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువు తున్న విద్యార్థి నిలకు బుధవారం విడుదలైన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ 2025 జాతీయ స్థాయి పరీక్ష ఫలితాలలో కాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. షాషావలి పత్రికల వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసరంకు చెందిన కె.అక్షిత, ఏ.అర్చన, ఏ.అంకమ్మ అనే ముగ్గురు విద్యార్థినులు ఈ పరీక్షలో ఉత్తీర్ణులై స్కాలర్షిప్‌కు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు 8వ తరగతి నుండి 12వ తరగతి వరకు ప్రతి సంవత్సరం రూ.12,000 చొప్పున నాలుగు సంవత్సరాలకు గాను మొత్తం 48 వేల రూపాయల స్కాలర్షిప్ అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.శారద,సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.స్టాలిన్,ఆర్. వసుంధర, గణిత ఉపాధ్యాయులు జయ ప్రకాష్, అబ్దుల్ రెహమాన్, పి.గోవిందు తదితరులు విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కాసరం ఏఎన్ఎంపై చర్యలు తీసుకోండి



తొట్టంబేడు, ఆగస్టు 12 ప్రభాతవార్త : విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు ఆశాలను కక్షపూరితంగా వేధిస్తున్న కాసరం సచివా లయం ఏఎన్ఎం దేవిపై చర్యలు తీసుకోవాలని సిఐటి యు జిల్లా కార్యదర్శి పెన గడం గురవయ్య డిమాండ్ చేశారు. బాధిత ఆశాలు, కాసరం గ్రామస్తులతో కలిసి బుధవారం సిఐటియు అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలంలోని కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ ఏఎన్ఎం దేవి తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోందన్నారు. విధులను సక్రమంగా నిర్వర్తించకపోగా, ప్రశ్నించిన గ్రామస్తుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తోందని వాపోయారు. ఈమె తీరు పట్ల ఇప్పటికే ఎనిమిది పర్యాయాలు షోకాజ్ నోటీసులు ఉన్నతాధికారుల నుంచి అందుకుందని గుర్తు చేశారు. కాసరం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న ఆశాలు పద్మ, చెంచులక్ష్మి, చెన్నమ్మలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ, చేయకుంటే వ్యక్తిగత దూషణలకు దిగుతూ వేధిస్తోందని ఆరోపించారు. అనంతరం వైద్యాధికారి మాధవ్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన వైద్యాధికారి ఏఎన్ఎం దేవికి షోకాజ్ నోటీసు జారీ చేశామనీ, ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి వాణి, సంధ్య, సీఐటీయూ నాయకులు గురునాథం, కాసరం గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్లిపూడి గ్రామంలో టీడీపీ ఇంటింటి ప్రచారం



తొట్టంబేడు, ఆగస్టు 12 ప్రభాతవార్త: మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజ నాయుడు ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం తాడిపత్రి పంచాయతీలోని కల్లిపూడి గ్రామంలో బుధవారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమా లను ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య నేతలు గాలి చలపతి నాయుడు, డి.రామనాయుడు, ప్రతాప్ రెడ్డి, డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ భీమల భాస్కర్, క్లస్టర్ జై చంద్రనాయుడు, యూనిట్ ఇన్‌చార్జీలు లెక్కల మురళి నాయుడు, జి. శంకర్ నాయుడు, టి. ఈశ్వర్ రెడ్డి, బూత్ ఇన్‌చార్జీలు కె. శంకరయ్య, కనపర్తి శంకర్ నాయుడు, ఉన్నం ప్రసాద్, భాను ప్రకాష్, గురప్ప, నెలబల్లి సునీల్, కల్లిపూడి సుబ్రహ్మణ్యం, బోనుపల్లి రాజేంద్ర, గ్రామ నాయకులు కె. సుబ్రహ్మణ్యం, ఎన్. వెంకటేష్, లోకేష్ మొదలగు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.